


కోటి ఆశలతో ఖరీఫ్!

జిల్లాలో 1.62 హెక్టార్లలో వరి సాగు!

పంట రుణాల లక్ష్యం రూ. 11,510 కోట్లు

- వెద పద్ధతిలో సాగుపై రైతుల ఆసక్తి
- కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదల తేదీ వెల్లడి తర్వాత పనులు ముమ్మరం





మచిలీపట్నంలో సాగుకు సిద్ధమైన వరి పొలాలు

కోటి ఆశలతో ఖరీఫ్‌కు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. కాలువలకు నీటిని విడుదల చేస్తే పనులు చేపట్టేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే అధికశాతం పొలాల్లో వేసవి దుక్కులు దున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు నిలబడి తేమశాతం పెరిగింది. నారుమడులు పోయాలా లేక వెదజల్లే పద్ధతిలో వరి విత్తనాలు చల్లాలా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. రుతుపవనాలు ప్రవేశించి వాతావరణం అనుకూలంగా మారితే పది రోజుల ముందుగానే జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 1,62,123 హెక్టార్లలో వరి సాగు చేయనున్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీనిపై ప్రణాళికను ప్రభుత్వానికి పంపగా ఆమోదం లభించింది. అలాగే ఇతర పంటల సాగుపైనా వ్యవసాయ శాఖ అంచనాలు రూపొందించింది. చెరకు 3,549 హెక్టార్లు, మినుము 1,340 హెక్టార్లు, వేరుశనగ 724 హెక్టార్లు, పత్తి 298 హెక్టార్లు, వివిధ రకాల పంటలు 133 హెక్టార్లలో సాగు జరుగుతుందని అంచనా వేసింది. 11,600 క్వింటాళ్ల వరి విత్తనాలను క్వింటాకు రూ.500 సబ్సిడీగా ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ విత్తనాలను మిగతా 6లో..

పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ

భూసారాన్ని పెంచేందుకు, సాగులో పెట్టుబడి, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు జిల్లాలో 2,486 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జనుము, జీలుగ విత్తనాలు నాలుగు కేజీలు, పిల్లిపెసర రెండు కేజీల బ్యాగుల చొప్పున ఎంపిక చేసిన రైతులకు అందజేశారు. జిల్లాలోని 35 రైతు గ్రూపులకు పురుగు మందులు పిచికారీ చేసేందుకు 35 డ్రోన్‌లను అందజేయనున్నారు. కౌలు రైతులకు 70,500 సీసీఆర్‌సీ కార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఖరీఫ్‌లో 89 వేల టన్నుల ఎరువులను రైతులు వినియోగిస్తారని వ్యవసాయశాఖ అంచనాగా ఉంది. వరి నాట్లు ప్రారంభమైన తర్వాత ఎరువుల డిమాండ్‌ను బట్టి ముందస్తుగానే ఎరువులను దిగుమతి చేసుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి రైతులకు రూ.11,510 కోట్లను పంట రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో కౌలు రైతులకు ఎంతమేర పంట రుణాలు అందిస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది.



విస్తారంగా..

నేటి నుంచి జిల్లాలో భారీ వర్షాలు



- జూన్ 2 వరకూ ఇదే పరిస్థితి
- ఉమ్మడి కృష్ణాకు ఎల్లో అలెర్ట్
- వారం రోజుల వివరాలు విడుదల చేసిన వాతావరణ శాఖ

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం, నైరుతి రుతుపవనాల దృష్ట్యా ఉమ్మడి కృష్ణాజిల్లాలో వచ్చే వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు వాతావరణ శాఖ సోమవారం ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం నుంచి వారం పాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. చిరుజల్లులతో మొదలై కుంభవృష్టిగా మారే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు ఉంటాయి. శివారు ప్రాంతాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఏటా జూన్ 10వ తేదీన తాకే నైరుతి రుతుపవనాలు ఈసారి జూన్ 2కు ముందే వస్తున్నాయి. రుతుపవనాలు ఇప్పటికే రాయలసీమను తాకినట్టు వాతావరణ శాఖ చెబుతోంది. కాగా, వాతావరణ శాఖ వారం రోజులకు ఫోర్‌కాస్ట్ ప్రకటించగా, జిల్లాలో పది రోజులపాటు వర్ష ప్రభావం ఉంటుందని అంచనా వేశారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
● కలెక్టర్ బాలాజీ హెచ్చరిక 8

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డుగోడలు

చీఫ్ ఇంజనీర్ పోస్టు భర్తీ కాకుండా పన్నాగాలు

- ఈఎన్‌సీలో అన్నీ తామేనంటూ వ్యవహారాలు
- పదోన్నతి పొందిన సీఈకి ప్రవేశం కల్పించకుండా అడ్డంకులు
- ఉన్నతాధికారులు చెబుతున్నా వినని పరిస్థితి
- సిబ్బంది లేకపోవడంతో పనులు ముందుకు సాగని దుస్థితి

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో చీఫ్ ఇంజనీర్ల (సీఈల) వార్ నడుస్తోంది. ఓపక్క, జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పథకంలో భాగంగా భారీ ఎత్తున పనులు చేపట్టాల్సి ఉంది. పనిచేయించే ఉన్నతాధికారుల అవసరం ఉంది. కానీ, స్వలాభం, రాజకీయాలతో అట్టుడికిపోతున్న గొల్లపూడిలోని కార్యాలయంలో మాత్రం కొందరికే ప్రవేశం అన్నట్టుగా వ్యవహరిస్తూ.. ఇతర అధికారులు రాకుండా అడ్డుకుంటున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం భ్రష్టుపట్టింది. వందల కోట్ల రూపాయల అవినీతికి చిరునామాగా మారింది. జల్‌జీవన్ మిషన్ (జేఏఎం) పనులను అడ్డం పెట్టుకుని మెటీరియల్ ఎక్కడ కొనుగోలు చేయాలో కూడా అధికారులే సొంత నిర్ణయాలు తీసుకుని కాంట్రాక్టర్లతో కొనుగోలు చేయించారు. కమీషన్ల వ్యవహారాలు నడిపారు. అంతేకాదు.. అడ్డగోలుగా డిప్యూటేషన్లు ఇవ్వటం, ఆ మాటున భారీ ఎత్తున ముడుపులు అందుకోవడం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేయాల్సిన డీఈఈలు, ఇంజనీర్లు ఇతర డిపార్ట్‌మెంట్లకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేయటానికి డీఈఈలు, ఈఈలు, ఎస్‌ఈల కొరత ఏర్పడింది. నాడు కాసుల కోసం కక్కుర్తి పడి అడ్డగోలుగా డిప్యూటేషన్లు ఇవ్వటంతో ప్రస్తుతం ఈ శాఖలో పనిచేయటానికి అధికారులు లేకుండాపోయారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు డీఈఈగా వచ్చిన విద్యాసాగర్‌కు ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలతో పాటు ఎస్‌ఈ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా మిగతా 6లో..



● మహానాడుకు పయనం

కడపలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే టీడీపీ మహానాడుకు జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నుంచి సోమవారం బస్సులు, కార్లలో భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్తున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తా
- దేవస్థానంలో అభివృద్ధి పనులు వేగవంతం
- దుర్గగుడి ఈవో శీనా నాయక్
6

ఇళ్లపట్టాల కేసులో కస్టడీకి వంశీ అనుచరుడు రంగా 8



కామధేనుతో పాడిరైతులకు సకల శుభాలు
- దేవనాథ్ జీయర్‌స్వామి
- వీరవల్లి ప్రాజెక్టు కామధేనులో వైభవంగా సీతారామ, లక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి మహా కుంభాభిషేకం
6

రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలని జేసీకి వినతి 6

మట్టి మాటలు కట్టిపెట్టోయ్..

పోలవరం మట్టిమాయంపై జలవనరుల శాఖ దిద్దు'పాట్లు'

- లెక్కలు సరిచేసే పనిలో చిత్ర విచిత్రాలు
- గన్నవరంలో పోయిన మట్టి ధవళేశ్వరానికి తరలించారట!



పోలవరం కాల్వపై మట్టి తవ్వకాలు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పోలవరం కుడికాల్వ మట్టి నిల్వలు కొల్లగొట్టడంపై జలవనరుల శాఖ అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగుతున్నారు. ఓవైపు విజిలెన్స్ తనిఖీలు, మరోవైపు ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తులు వస్తుండటంతో అధికారుల్లో కలవరం మొదలైంది. పోలవరం కాల్వగట్టు వెంబడి నిల్వ చేసిన మట్టిని వైసీపీ హయాంలో కొందరు అక్రమంగా తరలించుకుపోగా, వారికి కొందరు అధికారులు సహకరించారు. దీంతో ఈ వ్యవహారంలో బాధ్యత వహించాల్సి వస్తుందేమోనన్న భయంతో జలవనరుల శాఖ అధికారులు లెక్కలు సరిచేసుకునే పని మొదలుపెట్టారు. దీంతో సమాచార హక్కు దరఖాస్తులకు అధికారుల నుంచి చిత్రమైన సమాధానాలు వస్తున్నాయి. పోలవరంలో కరిగిపోయిన మట్టి గుట్టల పరిమాణాన్ని తగ్గించేందుకు పావులు కదుపుతున్నారన్న విమర్శలూ లేకపోలేదు.

విచిత్ర సమాధానాలు

కనిపించకుండా పోయిన మట్టి కొంత ఇరిగేషన్ అవసరాల కోసం తరలించాల్సి వచ్చిందని, కొంత దొంగతనాలకు గురైందన్న వివరాలను కూడా జలవనరుల శాఖ అధికారులు పొందుపరుస్తున్నట్టు సమాచారం. పోలవరం సీఈ ఆదేశాల మేరకు ధవళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం భారీగా మట్టిని తరలించినట్టుగా కూడా చూపటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బీబీగూడెం, గన్నవరంలో 19,86,333 క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించినట్టుగా చూపారు. ధవళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఇక్కడి నుంచి మట్టి తీసుకెళ్లడమేమిటో అర్థంకాని విషయం. అక్కడే స్థానికంగా పెద్ద ఎత్తున మట్టి మిగతా 6లో..



మొక్కజొన్న

తోట్లవల్లూరు లంకల్లో మొక్కజొన్న పంట వర్షార్పణమైంది. కల్లాల్లో ఆరబెట్టిన కండెలు రోజుల తరబడి తడిచి నాని పోయి మొలకలు వచ్చాయి. రైతు ఎం.హరిబాబు కల్లంలో రాశి మొత్తం కండెలపై గింజలన్నీ మొలకలు వచ్చి వేళ్లూనుకుంటున్నాయి. మండలంలో చాలా మంది రైతుల మొక్కజొన్న పరిస్థితి ఇలాగే ఉంది. వర్షాలతో ఒక్కో రైతుకు వేలాది రూపాయల నష్టం జరుగుతోంది. మేలో ఒకటి రెండు వానలు వచ్చేవని, ఈ ఏడాది పక్షం రోజులుగా నేల ఆరకుండా వర్షాలు కురవటంతో మొక్కజొన్న పంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -ఆంధ్రజ్యోతి, తోట్లవల్లూరు





తోట్లవల్లూరు లంకలోని రైతు హరిబాబు పొలంలోని కల్లంలో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలకు వచ్చిన మొలకలు

ఓపిక పోతోంది!


రోగులతో నిండిపోయిన జీజీహెచ్ మెడికల్, ఓపీ కౌంటర్లు

- రిజిస్ట్రేషన్ సేవల్లో తీవ్ర అంతరాయం
- గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి
- టెస్టులకు ఒక రోజు.. రిపోర్ట్స్ సంగతి దేవుడెరుగు
- వైద్యానికి ముందే నీరసించిపోతున్న రోగులు
- వృద్ధుల పట్ల సిబ్బంది దురుసు ప్రవర్తన
- జీజీహెచ్‌లో పేదలకు తప్పని తిప్పలు

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి)
ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వాసుపత్రికి వస్తున్న రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఉదయం 10 గంటలకు వచ్చినవారు సాయంత్రానికి కానీ ఇంటికెళ్లే పరిస్థితి లేదు. వైద్యం జరుగుతుందా అంటే అదీ లేదు. కేవలం ఓపీ, రిజిస్ట్రేషన్.. అదీ కాదంటే ఏదో ఒక్క పరీక్ష అంతే.. సాధారణ జ్వరానికి చికిత్సకు వచ్చినా గంటల తరబడి నిరీక్షించాల్సిందే. ఓపీ సేవల నుంచి రిజిస్ట్రేషన్, మందులు తీసుకునే వరకు అన్ని రకాల సేవలకు కాలయాపన తప్పడం లేదు. నీరసంతో వస్తున్న రోగులకు ఆసుపత్రిలో సేవలు ఆలస్యం కావడంతో ఉన్న కాస్త ఓపిక నశించి పడిపోయే పరిస్థితి ఉందని రోగి బంధువులు, సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికిత్సకు వస్తున్న రోగులు కనీసం మధ్యాహ్నం భోజనం చేయలేని పరిస్థితి. వైద్యం మరింత ఆలస్యం అవుతుందేమోనని భయంతో రోగులు, వారి సహాయకులు తిండి తినకుండా వైద్యం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీనికి తోడు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోగితో పాటు వారి సహాయకులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులకు ఓపీ దగ్గరే ఓపిక పోతోంది. గంటల తరబడి క్యూలో వేచి ఉండడంతో పాటు పరీక్షలకు ఎటు వెళ్లాలో తెలీక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. మంగళ, శనివారం తప్ప మిగతా రోజుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఓపీ కౌంటర్లు, సిబ్బంది సంఖ్య పెంచి రోగులకు సత్వర వైద్యం జరిగేలా చూడాల్సిన అధికారులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బ్లాకుల్లో అయితే రిజిస్ట్రేషన్ చేసే దగ్గర ఒకే కంప్యూటర్ ఉండటంతో క్యూలు బారులు తీరి ఉంటున్నాయి. రిజిస్ట్రేషన్ వద్ద మరింత సమయం పడుతోంది. టెస్టులకు సంబంధిత రోగులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి కనీసం గంటన్నరకు పైగా వేచి చూడాల్సిందే. దీంతో రోగులు వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటికే అనేక సమస్యలతో ఆసుపత్రికి వస్తున్న రోగులు గంటల తరబడి వేచి ఉండలేక అవస్థలు పడుతున్నారు.


జనరల్ ఓపీ వద్ద బారులు తీరిన రోగులు

పరీక్షలకు 'టెస్టు'.. రిపోర్ట్స్ తర్వాత రోజే..

ఓపీ, రిజిస్ట్రేషన్ కోసం కాలయాపన చేసి సంబంధిత పరీక్షలు చేయించుకోవడానికి వస్తే అక్కడా కాలయాపన తప్పడం లేదు. ఇవన్నీ దాటుకుని పరీక్షలకు వచ్చేసరికి మధ్యాహ్నం అవుతుంది. ఉదయం రక్త పరీక్ష చేయించుకుంటే రిపోర్ట్స్ సాయంత్రానికి వస్తున్నాయని రోగుల బంధువులు వాపోతున్నారు. దూరప్రాంతాల నుంచి ఎలాగోలా టెస్టులు చేయించుకుని రోగానికి సంబంధిత వైద్యుడిని సంప్రదించాలనో.. లేక వ్యాధికి తగ్గ మందులు తీసుకుని ఇంటికి పోదామనుకున్న వారు చాలామంది ఉంటారు. ఇది కాకుండా కొంతమంది మూడు నాలుగు పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఆసుపత్రిలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక టెస్టు చేయించుకోవడానికే రోజు పడుతుంది. అలాంటిది అన్ని పరీక్షలు చేయించుకోవాలంటే ఇంకెన్ని రోజులు పడుతోందోనని రోగులు, వారి సహాయకులు భయపడుతున్నారు. వేలల్లో ఖర్చుపెట్టి కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని పరిస్థితి వారిది. దీంతో ఎన్నిరోజులైనా ప్రభుత్వాసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాల్సిందే. తిరువూరుకు చెందిన ఓ వృద్ధుడి పరిస్థితి ఇదే. మూడు టెస్టులు రాస్తే కేవలం రక్తపరీక్ష మాత్రమే చేశారు. ఈ పరీక్ష రిపోర్టు కూడా సాయంత్రానికి ఇస్తామనడం, మిగతా రెండు టెస్ట్‌లకు మరుసటి రోజు రమ్మనడంతో నిరాసగా వెనుదిరిగాడు.


మూడో బ్లాక్‌లో రిజిస్ట్రేషన్ లైన్

దుర్గంధం మధ్యే రోగులకు వైద్యం

ఆసుపత్రిలో ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. ప్రధానంగా మూడో బ్లాక్‌లో రిజిస్ట్రేషన్, రిపోర్ట్స్ ఇచ్చే ప్రాంతంలో రోగులకు ఏర్పాటు చేసిన కుర్చీల పక్కనున్న కిటికీల్లోంచి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోంది. రోగులు ముక్కు మూసుకుని మరీ వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే వారు శుభ్రతపై పెదవి విరుస్తున్నారు. కరోనా సమయంలో నగరంలో పెద్దాసుపత్రిలోనే ఇలాంటి పరిస్థితులు ఉండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




స్ట్రెచర్, వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న రోగుల బంధువులు, సహాయకులు

ఎండైనా, వానైనా భరించాల్సిందే..

ముఖ్యంగా ఎమర్జెన్సీ, కాళ్లు, చేతులు విరిగిన రోగులను జనరల్ ఆసుపత్రి వార్డులలో నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులను సూపర్ స్పెషాలిటీకి తీసుకెళ్లే సమయంలో భరించలేని ఎండ ఉన్నా, వర్షం పడినా వారు తట్టుకోవాల్సిందే. లేకపోతే ఎండ, వర్షం తగ్గే వరకు వేచిచూడాలి. ఈ లోగా వైద్యులు ఉంటారో, ఉండరో తెలీని పరిస్థితి. అప్పటికే జబ్బులు, విరిగిన ఎముకల నొప్పులతో బాధపడుతున్న రోగులను తీసుకెళ్లే సమయంలో కొంతమంది నొప్పిని భరించలేక విలవిల్లాడడం చూస్తున్న వారికి బాధ కలిగించింది. ముఖ్యంగా వర్షం పడే సమయంలో రోగులను తీసుకెళ్లలేక, డాక్టర్లు వెళ్లిపోతారేమోనని భయంతో సమయాన్ని వృధా చేయలేక ఇబ్బంది పడుతున్నారు. జనరల్ వార్డు నుంచి సూపర్ స్పెషాలిటీకి రోగులను చక్రాల కుర్చీ, స్ట్రెచర్‌పై తీసుకెళ్లడానికి రోగితో వచ్చిన వారే దిక్కు. రోగులను తీసుకెళ్లాల్సిన సిబ్బంది ఎక్కడా కనిపించరో లేక అసలు లేరో అర్థం కావడం లేదని రోగుల సహాయకులు అంటున్నారు. సోమవారం సూపర్ స్పెషాలిటీ నుంచి రోగిని బయటకు తీసుకువస్తున్న సమయంలో స్ట్రెచర్‌కు ఒక వీల్ ఊడిపోవడం గమనార్హం. జనరల్ ఆసుపత్రికి, సూపర్ స్పెషాలిటీకి మధ్య ఉన్న సుమారు 200 మీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ ప్రాంతంలో చదునైన రోడ్డు వేయడంతో పాటు షెడ్డు నిర్మించి రోగులకు రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులు, సహాయకులు కోరుతున్నారు.


ఊడిపోయిన స్ట్రెచర్ వీల్‌ను సరిచేస్తున్న రోగి బంధువులు



బొప్పాయి కోస్తే లోన మరోకాయలు

బాపయ్య ఇంట వింత బొప్పాయి!

- విస్తుగొల్పుతున్న కాయ లోపల కాయలు



గుడ్లవల్లేరులోని సూర్యదేవర బాపయ్య సంత వ్యాపారి. ఆయన ఇంటి పెరట్లో బొప్పాయి చెట్టుకి వింత కాయలు కాస్తున్నాయి. ఇంట్లో వారు బొప్పాయిని తినేందుకు కోయగా కాయలో ఇంకోకాయ, అదీ కోస్తే మరోకాయ ఉండటంతో తొలుత కంగారు పడ్డారు. తర్వాత మరోకాయ కోసినా అదే విధంగా ఉండటంతో ఆశ్చర్యానికి గురయ్యారు. కాయల్లో గింజలు ఉండటంలేదు. చెట్టుకు కాసిన కాయల్లో మూడొంతులు అదే విధంగా ఉంటున్నాయి. గతంలో ఇలా ఎపుడూ కాయలేదని బాపయ్య కుటుంబసభ్యులు చెబుతున్నారు. కాయలోని కాయ కూడా రుచి బాగానే ఉందని, లోపలి కాయకు తొక్క మాత్రం లేదని చెప్పారు. వింత బొప్పాయిలను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. - గుడ్లవల్లేరు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పేర్ని నాని కాపులకు క్షమాపణ చెప్పాలి

- వైసీపీ వాళ్లతోనే వంశీకి హాని!
- జాగ్రత్తగా ఉండాలని ఆయన భార్యకు సూచన
- నాని జైలుకు వెళ్లడం ఖాయం : దిలీప్‌కుమార్

మచిలీపట్నం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహనరంగా మరణంపై కాపుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బియ్యం దొంగ పేర్ని నాని తక్షణమే కాపులకు క్షమాపణ చెప్పాలని మచిలీపట్నం 6వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి దిలీప్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులు దిలీప్‌కుమార్, పీవీ ఫణికుమార్ మీడియాతో మాట్లాడారు. పేదల నివేశన స్థలాల కోసం పోరాడిన రంగా ఎక్కడ? ఫేక్ పట్టాలు పంచిన వంశీ ఎక్కడ? అని ప్రశ్నించారు. పేర్నినాని మాటలు చూస్తుంటే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి వైసీపీ వాళ్ల వల్లే హాని తలపెట్టేలా ఉన్నాయన్న అనుమానం కలుగుతోందన్నారు. ఈ విషయంలో వంశీ భార్య పంకజశ్రీ జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. మచిలీపట్నంలో ఫేక్ పట్టాలు పంచిన పేర్ని నాని మీడియాతో నీతి కబుర్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. త్వరలోనే పేర్నినాని కేసులపై విచారణ ప్రారంభమవుతుందని, ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. గతంలో పవన్‌కల్యాణ్‌ను విమర్శించిన పేర్నినానిని ఎన్నికల్లో ప్రజలు ఇంటికి సాగనంపిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నూకల శేషుబాబు, మత్తి వెంకటేశ్వరరావు, తోట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించండి

మచిలీటపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రేషన్‌డీలర్ల సంక్షేమసంఘం అధ్యక్షుడు కాగిత కొండ, పలువురు రేషన్ డీలర్లు సోమవారం జేసీ గీతాంజలిశర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్నభోజన పథకం నిమిత్తం పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సరుకు రవాణా చార్జీలు పెండింగ్‌లో ఉండిపోయాయని, వాటిని విడుదల చేయాలని కోరారు. ఒంటరిగా ఉన్న రేషన్‌డీలర్లకు నామినీ సౌకర్యాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 6-ఏ కేసు నమోదైన రేషన్ డీలర్లనుంచి అపరాధ రుసుమును కట్టించుకుని షాపులను కేటాయించాలని కోరారు. రేషన్ డీలర్లసంఘం నాయకులు యనమల లలిత, యార్లగడ్డ శ్రీను, సుధాకర్ తదితరులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తా

- దేవస్థానంలో అభివృద్ధి పనులు వేగవంతం
- దుర్గగుడి ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మే 26 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులే పెన్నిధి అని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తానని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ తెలిపారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆరో అంతస్తులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవోగా బాధ్యతలు చేపట్టాక చాలా అంశాలను పరిశీలించి కొంత అవగాహనకు వచ్చానని, ఇంకా పరిశీలించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా దేవస్థానానికి సంబంధించి పార్కింగ్ సమస్య జటిలంగా ఉందని, దీనిని పరిష్కరించేందుకు వివిధ కోణాల్లో పరిశీలన చేస్తున్నామన్నారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, పున్నమిఘాట్ నుంచి దేవస్థానం బస్సులు ఏర్పాటు చేసి కొండపైన ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా నాలుగు ఎకరాల ఖాళీ స్థలం ఉందని, అక్కడ పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మరోవైపు కుమ్మరిపాలెం సెంటర్‌లో టీటీడీ స్థలాన్ని కూడా వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పున్నమిఘాట్ వద్ద భక్తులు వాహనాలను పార్కింగ్ చేసుకున్నట్టయితే అక్కడ నుంచి దేవస్థానం బస్సుల్లో కొండపైకి చేరుకోవచ్చన్నారు. భక్తులు ఈ విషయంలో పూర్తిగా సహకరించాలన్నారు. భక్తులు ఎక్కువ మంది నదిలో పుణ్యస్నానాలు చేసేందుకు దుర్గాఘాట్‌ను విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని, అందుకుగాను సంబంధిత ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. కేంద్ర పథకమైన పిలిగ్రిమేజ్ రెజువనేషన్ అండ్ స్పిర్చ్యువల్ ఆగుమెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) పథకం కింద పలు అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి సహాయం తీసుకునేందుకు దేవదాయశాఖ మంత్రి, విజయవాడ ఎంపీ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారని, త్వరలోనే కేంద్రం నుంచి సానుకూల స్పందన రావచ్చునన్న అభిప్రాయం ఉందని తెలిపారు. అమ్మవారి నైవేద్యం నిమిత్తం 11.30 నుంచి 1.30 గంటల వరకు వీఐపీ దర్శనాలను నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. దేవస్థానంలో రాతి యాగశాల, పూజామండపాలు, శ్రావణమాసంలోగా అందుబాటులోకి వస్తాయన్నారు. అన్నదాన భవనం, లడ్డూ తయారీ భవనం దసరా ఉత్సవాల నాటికి సిద్ధమవుతాయని, అప్పటికి వాటిని వినియోగంలోకి తేవటానికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టామని తెలిపారు. మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన నవగ్రహ మండపం పునఃప్రతిష్ఠ కార్యక్రమం జూన్ 3, 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ-గవర్నెన్స్ ద్వారా వాట్సాప్ సేవలు అందిస్తూ విరాళాలు చెల్లించటం, ఆర్జిత సేవల బుకింగ్‌లు భక్తులు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సహకారం, దాతల తోడ్పాటుతో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈవో తెలిపారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, ఉపప్రధాన అర్చకుడు కోటా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

దుర్గగుడి ఏఈఓ దుర్గారావు బదిలీ

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.దుర్గారావును ద్వారకా తిరుమలలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ సోమవారం దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ పి.చంద్రకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న బి.వెంకటరెడ్డిని దుర్గామల్లేశ్వర దేవస్థానానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

కామధేనుతో పాడిరైతులకు సకల శుభాలు

- దేవనాథ్ జీయర్‌స్వామి
- వీరవల్లి ప్రాజెక్టులో వైభవంగా సీతారామ, లక్షణ సమేత దాసాంజనేయస్వామి మహా కుంభాభిషేకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు బలవర్ధక ఆహారమైన పాలు, పాల ఉత్పత్తులను అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో అందిస్తూ 60 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ భగవత్ అనుగ్రహంతో అవాంతరాలను అధిగమించి పాడి రైతు కుటుంబాలతో పాటు ప్రజలకు సకల శుభాలను అందిస్తున్న వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(విజయ పాల ఫ్యాక్టరీ) మరింతగా వృద్ధి చెందాలని దేవనాథ్ జీయర్ స్వామి అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ ఆవరణలోని సీతారామ, లక్షణ సమేత దాసాంజనేయస్వామి దేవస్థానంలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు దంపతులు నిర్వహించిన మండల పూజ, మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. వేద మంత్రోచ్చరణల మధ్య మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. సీతారామ, లక్షణులను భుజాలపై మోస్తూ భక్తులకు దర్శనమిచ్చే దాసాంజనేయస్వామి దేశంలోనే రెండవదని దేవనాథ్ జీయర్ స్వామి తెలిపారు. గో సంరక్షణ పాడిరైతు కుటుంబాలతో పాటు ప్రజలకు సకల శుభాలు అందిస్తుందని, అలాగే ప్రాజెక్ట్ కామధేను కూడా అందరికీ సకల శుభాలనందిస్తుందన్నారు. దైవశక్తి ద్వారా మాత్రమే ఎన్నో అవాంతరాలను అధిగమించి లక్షాయాభైవేల పాడిరైతుల సహకారంతో కృష్ణామిల్క్ యూనియన్ వ్యవస్థ మనగలుగుతున్నదని చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో దాసరి బాలవర్ధనరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




వీరవల్లి కామధేనులోని సీతారామ,లక్షణ సమేత దాసాంజనేయ స్వామి మహా కుంభాభిషేక పూజలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, దేవనాథ్ జీయర్‌స్వామి

కోటి ఆశలతో ఖరీఫ్!

(5వ పేజీ తరువాయి)

దిగుమతి చేసుకోవాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా వరిసాగుకు 1.03 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే విత్తనాలు కాకుండా సుమారుగా 90వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి ఉంది. మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనాక్షేత్రంలో ఉత్పత్తి చేసిన ఎంసీఎం-100, ఎంసీఎం-103, ఎంసీఎం-125 విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయశాఖ ద్వారా ఈ ఏడాది బీపీటీ 5204, ఎంటీయూ 1061, 1318 వంటి రకాల వరి విత్తనాలను కిలోకు రూ.5 చొప్పున సబ్సిడీపై అందించాలని నిర్ణయించారు. రైతులు 65 శాతం మేర ఎంటీయూ-1318 రకం వరి వంగడాన్ని సాగుచేసే యోచనలో ఉన్నారు. ఈ రకం వరి వంగడంతో పాటు ఎంటీయూ-1061, 1064, 1121, 7029, 1224, స్వర్ణ, బీపీటీ-3291 వంటి రకాలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవు తున్నారు. నాణ్యమైన విత్తనాలు ఎక్కడ ఉన్నాయనే అంశంపై రైతులు ఆరా తీస్తున్నారు. కంకిపాడు, గన్నవరం, తోట్లవల్లూరు, ఉయ్యూరు. పామర్రు, చల్లపల్లి, మొవ్వ తదితర మండలాల్లో బోరు నీటి ఆధారంగా నారు మడులు పోసేందుకు రైతులు సిద్ధమ వుతున్నారు. గుడ్లవల్లేరు, పెడన, బంటుమిల్లి, గూడూరు, మచిలీపట్నం తదితర మండలాల్లో వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేసేందుకు సమాయత్తమవుతున్నారు.

మట్టి మాటలు..

(5వ పేజీ తరువాయి)

లభిస్తుంది. ఇక్కడి నుంచి తరలించడం వల్ల అధిక రవాణా వ్యయమవుతుంది. ఇంత ఖర్చుచేసి ధవళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు మట్టి తీసుకెళ్లాల్సిన అవసరమేమిటో అధికారులే చెప్పాలి.

గన్నవరంలో మట్టి హాంఫట్

గన్నవరం పరిధిలో కనిపించకుండా పోయిన పోలవరం మట్టికి అధికారులు కొత్త అర్థం చెబుతున్నారు. చైనేజీ నెంబర్లు 143లో 2,31,245 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 144లో 1,49,897 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 145లో 2,25,025 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 146లో 2,60,489 క్యూబిక్ మీటర్లు, చైనేజీ నెంబర్ 146.285లో 65,796 క్యూబిక్ మీటర్లు.. ఇలా మొత్తంగా 9,32,452 క్యూబిక్ మీటర్ల మట్టి దొంగతనానికి గురైందని సమాధానం ఇచ్చారు. అసలు ఇంత మట్టి దొంగతనానికి గురవుతుంటే, అధికారులు ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డుగోడలు

(5వ పేజీ తరువాయి)

అప్పగించారు. అయితే, ఇక్కడ ఒక్క పని కూడా ముందుకు వెళ్లట్లేదని, సిబ్బంది లేరని, సెలవు పెట్టి వెళ్లిపోతానని ఏకంగా కలెక్టర్ లక్ష్మీశ దగ్గర మొర పెట్టుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

అడుగడుగునా అడ్డంకులు

ఈఎన్‌సీ కార్యాలయంలో ఒక ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ), నాలుగు చీఫ్ ఇంజనీర్ల (సీఈ) పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఈఎన్‌సీ కార్యాలయంలో గాయత్రి, నాయక్, భాషా, సత్యనారాయణ చీఫ్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఈఎన్‌సీగా పనిచేసిన కృష్ణారెడ్డి పదవీ విరమణ తర్వాత అప్పటి చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సంజీవ్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించారు. సంజీవ్‌రెడ్డి పదవీ విరమణ నేపథ్యంలో మరో చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న గాయత్రికి ఈఎన్‌సీగా బాధ్యతలిచ్చారు. గాయత్రికి ఎలాగూ ఈఎన్‌సీ ఇన్‌చార్జి ఇచ్చారు కాబట్టి ఆమె ఆ పోస్టులో వేతనం తీసుకోవచ్చు. కానీ, అలా చేయట్లేదు. ఒకవేళ గాయత్రి ఈఎన్‌సీ పోస్టులో వేతనం తీసుకుంటే.. మరో సీఈ పోస్టును భర్తీ చేసుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా చీఫ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాలో నెక్కంటి వెంకట సత్యనారాయణ, ఏషన్ భాషా, వెంకట రమణ ఉన్నారు. ఈ ముగ్గురూ ఒకేసారి పదోన్నతి అందుకున్నారు. వీరిలో ఏషన్ భాషాపై చార్జెస్ ఉండటంతో ఆయన కోర్టుకెళ్లి పోస్టు తెచ్చుకున్నారు. నెక్కంటికి చీఫ్ ఇంజనీర్‌గా అవకాశం కల్పించిన ఈఎన్‌సీ కార్యాలయం ఉన్నతాధికారులు వెంకట రమణకు మాత్రం ఇవ్వడానికి ఇష్టపడట్లేదు. ఖాళీలు లేవని, ఆయన్ను తీసుకోవటం కుదరదని ఇన్‌చార్జి ఈఎన్‌సీ గాయత్రి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆమె ఈఎన్‌సీ హోదాలో జీతం తీసుకుంటే, సమస్య పరిష్కారమవుతుందని ఉన్నతాధికారులు సూచించినా ఆ పని చేయట్లేదు. కాగా, ఈఎన్‌సీ కార్యాలయంలో పని చేయడానికి వెంకట రమణ ఎంతో పోరాడినా అడుగడుగునా అడ్డు పడుతూ వచ్చారు. చేసేదేమీలేక ఆయన మరో డిపార్ట్‌మెంట్‌కు వెళ్లిపోవడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈఎన్‌సీ కార్యాలయంలో తగినంతగా అధికారులు లేకపోతే, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు తీసుకెళ్లే పరిస్థితి లేకపోయినా.. ఇష్టానురీతిన వ్యవహరిస్తున్నారు.

పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- డీఈవోకు ఏపీటీఎఫ్ నేతల వినతి

మచిలీపట్నం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని డీఈవో పీవీజే రామారావుకు కృష్ణాజిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి. రాధిక, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీంలు వినతి పత్రం సమర్పించారు. ఎంఈవో లాగిన్‌లోకి వెళ్లిన బదిలీ దరఖాస్తులను డీఈవో లాగిన్‌లోకి తీసుకువచ్చే సందర్భంగా ఉన్న తప్పులను సవరించాలని కోరారు. టీచర్లకు ఇచ్చే పాయింట్లు కొందరికి తేడాలున్నాయని, ఆ తేడాలను సరిచేయాలన్నారు.


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.10.80 లక్షలు



హనుమాన్‌జంక్షన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం హుండీని తెరిచి లెక్కించారు. గడిచిన 67 రోజులకు గాను హుండీలో రూ.10,80,452లు ఆదాయం లభించినట్లు దేవస్థానం ఈవో పి.తారకేశ్వరావు తెలిపారు. ఎండోమెంట్ అధికారి సురేష్‌కుమార్ ఆద్వర్యంలో హుండీని తెరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, గరికపాటి నాగేశ్వరరావు, వడ్డి రాము, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడిగా మీసాల

ఉయ్యూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు పట్టణ 13వ వార్డు అధ్యక్షుడిగా మీసాల అప్పలనాయుడు నియమితులయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న అప్పలనాయుడును 13వ వార్డు పార్టీ అధ్యక్షుడుగా నియమించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు



గన్నవరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీకేఆర్ సేవా సంఘంలోని అనాథలు, వృద్ధుల కోసం ముళ్లపూడి రత్న శిరోమణి జ్ఞాపకార్థం ఆమె మనువరాలు విద్య శ్రీ రూ.10వేలు విలువ చేసే నిత్యవసర సరుకులను సోమవారం సంఘ చైర్మన్ కానూరు శేషు మాధవికి అందజేశారు. శేషుమాధవి మాట్లాడుతూ అనాథ బాలలు, వృద్ధుల కోసం మొదటి నెల జీతాన్ని మానవత్వంతో అందజేయడం గొప్పవిషయమన్నారు.



మానికొండలో సబ్సిడీ వరివిత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఏఓ భానుప్రియ

సబ్సిడీపై వరి విత్తనాలు

ఉంగుటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ వ్యవసాయ సాగుకు రైతులు సమాయత్తమౌతున్న తరుణంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించే ఎంటీయూ-1318రకం వరి విత్తనాలు మండలంలోని అన్ని రైతుసేవాకేంద్రాల్లో అందుబాటులో వుంచినట్లు ఏవో వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని వివిధ రైతు సేవాకేంద్రాల్లో వీఏఏల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న రాయితీ విత్తనాల ప్రక్రియను ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు.

రాయితీపై జనుము..

పచ్చిరొట్ట విత్తనమైన జనుము విత్తనాలు 50శాతం రాయితీపై రైతులకు అందించేందుకు ఉంగుటూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో అందుబాటులో వుంచినట్లు ఏవో తెలిపారు. కేజీ అసలు ధర 109 రూ.లు కాగా 50శాతం సబ్సిడీ పోను కేజీ 54.50 రూ.లకే రైతులకు అందిస్తున్నామన్నారు.



భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న దేవనాథ్ జీయర్‌స్వామి

రాష్ట్రం రామరాజ్యమవ్వాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : అందరూ కలిసిమెలసి కృషి చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని దేవనాథ్ జీయర్‌స్వామి అన్నారు. రాముని పాలనలో(చాతుర్మయం)అన్ని కులాలు కలిసిమెలసి అభివృద్ధికి కృషి చేసేవారని అలాగే మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అందరూ కలిసి కృషి చేయాల్సిన అవసర ముందన్నారు. ప్రజలు సుఖశాంతులతో జీవించేలా రామరాజ్యం కావాలని ఆశిస్తున్నానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

యోగా కమిటీ సమావేశం

ఉయ్యూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించి యోగా డే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో అధ్యక్షతన మండలస్థాయి యోగా కమిటీ సమావేశం నిర్వహించి యోగా గురించి గ్రామాల్లో చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ నెల 31 వరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, స్వయం సహాయ సంఘాల మహిళలు, ఉపాధి హామీ కార్మికులకు దశలవారిగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. యోగాపై అవగాహనకల్పించేందుకు బుధవారం మండల స్థాయిలో ఉయ్యూరులో పెద్దయెత్తున ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. జూన్ 2 నుంచి యోగాపై వ్యాసరచన, వక్తృత్వం, గీతాలు, నినాదాలు, సూర్య నమస్కారాలు, రంగోలి వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. తహసీల్దార్ ఎం సురేశ్‌కుమార్, రూరల్ ఎస్సై కె.సురేశ్‌బాబు, మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





పోరంకి టీడీపీ కార్యాలయం నుంచి బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు.. మహానాడుకు తరలివెళుతున్న రేమల్లె టీడీపీ నాయకులు

మహానాడును విజయవంతం చేద్దాం

టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు

పెనమలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలుగు తమ్ముళ్ల పండుగ మహానాడుకు వేలాదిగా తరలివెళ్లి విజయవంతం చేయాలని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పిలుపునిచ్చారు. సోమవారం కానూరులోని తన కార్యాలయంలో కానూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మహానాడుకు వెళ్లే రూట్‌మ్యాప్‌ను వివరించారు. దారిలో ఉన్న వివిధ సందర్శనార్థ ప్రదేశాల గురించి వివరించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారి నిర్వహిస్తున్న మహానాడుకు పెనమలూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు షేక్ బుజ్జి, యార్లగడ్డ సుచిత్ర, ఇమాం, కొండ, రమేష్, బచ్చన్, రియాజ్, ఇక్బాల్, పువ్వాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న వెలగపూడి శంకరబాబు

పెనమలూరు నుంచి మహానాడుకు..

కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలుగు తమ్ముళ్ల పండుగ మహానాడుకు పెనమలూరు నుంచి వందల సంఖ్యలో తెలుగు దేశం శ్రేణులు బయలుదేరి వెళ్లాయి. కార్లు, బస్సులు, సొంత వాహనాల్లో ఉత్సాహంగా ఎవరికి వారు తరలి వెళ్లారు, యనమలకుదురు, పోరంకి, తాడిగడప, పెనమలూరు, కానూరుల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు మహానాడుకు హాజరయ్యేందుకు వెళ్లారు. ఎక్కడికక్కడ ఆయా గ్రామాల టీడీపీ అధ్యక్షులు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలను దగ్గరుండి మరీ సాగనంపారు. పోరంకి కార్యాలయం నుంచి తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పెనమలూరు అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, కుర్రా నరేంద్ర, తుమ్మల రాంకుమార్, అబ్రహాం, రావి రాకేష్, దేవినేని రత్నభూషణం, బోడె సురేంద్ర, వంగూరు పవన్, యేనుగ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రేమల్లె నుంచి..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : టీడీపీ మహానాడుకు మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు, శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్లారు. కడపలో ప్రతిష్టాత్మకంగా మంగళవారం నుంచి జరిగే మహానాడుకు రంగన్నగూడెం, రేమల్లె, తిప్పనగుంట, కాకులపాడు, కొత్తపల్లి, మల్లవల్లి తదితర గ్రామాల నుండి టీడీపీ శ్రేణులు సోమవారం మధ్యాహ్నం నుంచి బయలుదేరి వెళ్లారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 30కార్లలో స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, బాబీ, దేవినేని సత్యనారాయణ, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కార్యదర్శి పుట్టా సురేష్, యనమదల సుధాకర్, వడ్లమూడి జానకీ రామ్మూర్తి, తదితరులతో పాటు టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.



కడపలో మహానాడు ఏర్పాట్లను మంత్రులతో కలిసి పర్యవేక్షిస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

మహానాడు ఏర్పాట్లలో వైవీబీ

ఉయ్యూరు: కడపలో మహానాడ ప్రాంగణంలో ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మంత్రులతో కలసి సోమవారం పర్యవేక్షించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పెద్దయెత్తున జరుగనున్న మహానాడు కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. మహానాడు కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ట్రాక్టర్‌పైనుంచి పడి మహిళా కూలీ మృతి



ట్రాక్టర్ ట్రక్కు కిందపడి మృతి చెందిన ఇటుక కూలీ రాధారాణి

పెనమలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టరు డ్రైవరు నిర్లక్ష్యంగా నడపడంతో ట్రాక్టరు పైనుంచి ఇటుక బట్టీల కూలీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తాడిగడప సెంటరులో సోమవారం ఉదయం జరిగింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యూరు మండలం పెదఓగిరాల గ్రామానికి చెందిన ఘంటసాల రాధారాణి (44) చలివేంద్రపాలెంలోని ఇటుకల తయారీ బట్టీలో కూలీగా పనిచేస్తోంది. సోమవారం ఉదయం ట్రాక్టరు ఇటుక లోడ్‌తో కానూరుకు వస్తుండగా తాడిగడప సెంటరులో బందరు రోడ్డుపై డ్రైవరు నిర్లక్ష్యంగా నడపడంతో ట్రాక్టరు ట్రక్కు లింకు తెగిపోయింది. దీంతో ఇటుకలపై కూర్చుని ఉన్న రాధారాణి కిందపడిపోయింది. ట్రక్కు టైరు ఆమెపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు ఖాసిం

సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతా సదస్సు

పెనమలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండల సీపీఎం ఆధ్వర్యంలో యనమలకుదురులో సోమవారం సమైక్యతా సదస్సు నిర్వహించారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం ప్రజలందరూ కలిసిమెలిసి జీవిస్తూ ఉగ్రవాదంపై సమష్టిగా పోరు జరపాలని నాయకులు పేర్కొన్నారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని వక్తలందరూ ముక్తకంఠంతో ఖండించారు. ఉగ్రదాడులను పసిగట్టడంలో నిఘా వైఫల్యాన్ని దుయ్యబట్టారు. పాకిస్తాన్‌పై మనదేశం చేస్తున్న యుద్ధం గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధం ముగిసింది అని వ్యాఖ్యానించడం, అందుకు మోదీ మౌనంగా ఉండడం మన దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టుపెట్టడమేనన్నారు. హిందూ ముస్లింలు అందరూ కలిసి మెలిసి జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేశవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏకే బాషా మండల కమిటీ కార్యదర్శి షేక్ ఖాసిం, తాడంకి నరేష్, శేషు, పాతాళ లక్ష్మి, వాటపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కారులో గుండె ఆగి ఒకరి మృతి

గుణదల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కారులో గుండె ఆగి ఒకరు మృతి చెందిన ఘటన లయోల కళాశాల వద్ద జరిగింది. కానూరులో నివాసం ఉంటున్న వెంకట కృష్ణారావు(64) ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయలు దేరి బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గం మధ్యలో లయోల కళాశాల సమీపంలోని దేవయ్య ఆడిటోరియం ఏరియాలోకి రాగానే గుండెపోటు రావడంతో కారును పక్కన నిలిపేశాడు. ఈ క్రమంలో ఆయనకు గుండె ఆగిపోయింది. కారులో ఎవరూ లేరు. దీంతో అటుగా వెళ్లేవారు గమనించి మాచవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మాచవరం పోలీసులు తెలిపారు.



ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత

హనుమాన్‌జంక్షన్,మే 26 (ఆంధ్రజ్యోతి): జంక్షన్ ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రెయినేజీ పూడికతీత పనులు బాపులపాడు గ్రామ పంచాయతీ చేపట్టింది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు డ్రెయినేజీలో మురుగు ఎక్కిడిక్కడే నిలిచిపోయి రహదారి మీదకు ఎగదన్ని ఇబ్బందిగా మారడంతో రెండు రోజులుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరీ పర్యవేక్షణలో పూడికతీత పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా విజయవాడ రోడ్డు డ్రెయినేజీలో పూడిక బాగా పేరుకుపోవడంతో రహదారి మీదకి మురుగు ఎగదన్నుతోంది. వ్యాపారులు, పాదచారులకు ఇబ్బందిగా మారడంతో పూడికతీత పనులు చేపట్టారు. విజయవాడ, నూజివీడు రహదారుల వెంబడి డ్రెయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయాయి.

శివాలయం భూములకు అదనపు ఆదాయం



తరిగొప్పల శివాలయంలో వేలం పాట నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

ఉంగుటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరిగొప్పల శ్రీదుర్గామల్లికార్జున స్వామి దేవస్థానం భూముల కౌలు వేలం ఎండోమెంట్ అధికారులు, కౌలురైతులు, గ్రామపెద్దలు, అర్చకస్వాముల సమక్షంలో సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. గన్నవరం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.అనూరాధ, ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస్(వాసు) ఆద్వర్యంలో ఆలయానికి సంబంధించి 11ఎకరాల వరిసాగు భూమికి బహిరంగవేలం నిర్వహించగా 25మంది వేలంపాటలో పాల్గొన్నారు. భూముల వేలం ద్వారా ఈ ఏడాది శివాలయానికి రూ.3,43, 600ల ఆదాయం సమకూరిందని, గత సంవత్సరం కంటే రూ.1.01,500ల అదనపు ఆదాయం లభించిందని ఎగ్జిట్ ఆఫీసర్ వై.వాసు తెలిపారు. కాగా ముక్కపాడు పట్టాభిసీతారామస్వామి దేవస్థానం భూముల కౌలు వేలం కొన్ని అనివార్యకారణాల వల్ల రద్దుచేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సామాజిక సేవే మానవతా లక్ష్యం

గన్నవరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో మానవతా స్వచ్ఛంద సంస్థ ముందుంటుందని ఆ సంస్థ మండల అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మాసాంతర సమావేశం సోమవారం జరిగింది. దీనిలో మెడిసిన్ చదువుతున్న గీతికకు రూ.10వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ మున్నీసాకు రూ.5వేలు, పలువురు పేదలకు నిత్యవసర సరుకులు, గ్రామ ప్రముఖుడు నెక్కలపూడి ఈశ్వరరావు ఆర్థిక సహకారంతో కొల్లూరి మరియమ్మ కృత్రిమ కాలు కోసం రూ.29వేలు అందజేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి కర్రా వరప్రసాద్, ఉపాధ్యక్షులు కెఎస్ జగదీశ్వరరావు, గౌరవ సలహాదారు గన్నె వెంకట్రావు, వీసం ప్రసాదరావు, సయ్యద్ లాల్ ముక్కామల సుబ్బారావు, పొట్లూరి రామకృష్ణారావు, వివి.కృష్ణమోహన్, వడ్లమూడి వెంకటేశ్వరరావు, నల్లాని చక్రవర్తుల రఘుకుమార్ పాల్గొన్నారు.

సృజనను పెంచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో లెమన్ స్పూన్ పోటీలు

గన్నవరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నైపుణ్యాలను, సృజనను పెంచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడుతున్నాయని గ్రంథాలయ అధికారి కె.కృపానందం అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు లెమన్ స్పూన్ పోటీలు, పుస్తక పఠనం, కథలు నేర్పించటం చేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి పర్యవేక్షణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై సచివాలయ ఉద్యోగి ఉదయశ్రీ అవగాహన కల్పించారు. స్నేహితులతో ఇంగ్లీష్‌లో మాట్లాడటం, ఇంగ్లీష్ పుస్తకాలు చదవడం ద్వారా బాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు.

ఉయ్యూరు : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం చిన్ననాటి నుంచి అలవరుచుకోవాలని రిసోర్స్ పర్సన్ కోరాడ శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు ఆరోగ్య ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కథల పుస్తకాలు చదివించి అందులో నీతిని వివరించారు. గ్రంథాలయ అధికారి బి.రమణి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉయ్యూరు గ్రంథాలయంలో యోగాసనాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

ఆధ్యాత్మిక, పర్యాటక సమాహారం

టూరిజం సర్క్యూట్ కిందకు తీసుకొస్తే మరింత ప్రాచుర్యం

గరుడాచలం



కొండ పైన గరుడ స్వామి విగ్రహం

భక్తులకు దర్శనమిచ్చే స్వామి వారు



- త్రేతాయుగం నాటి క్షేత్రంగా గుర్తింపు
- 2006లో ఆంధ్రజ్యోతి కథనంతో వెలుగులోకి
- క్రమేణా అభివృద్ధి వైపు పరుగులు

తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆరాధ్య దైవం.. గరుడాచలం వీరనారసింహస్వామి క్షేత్రం! ఈ ప్రాంతం గురించి రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలకు తెలుసు! పెద్దగా అభివృద్ధి లేకపోవటంతో ఈ అరుదైన క్షేత్రం గురించి బాహ్య ప్రపంచానికి పెద్దగా తెలియదు. ఆధ్యాత్మిక సుగంధాలతో, పర్యాటకానుభూతులతో అలరారే ఈ ప్రాంతాన్ని టెంపుల్ టూరిజం, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే జగ్గయ్యపేటకు మహర్దశ పడుతుంది. గరుడాచలం క్షేత్రంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్

వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి పంచ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న గరుడాచలం వీరనారసింహ స్వామి క్షేత్రం ఆధ్యాత్మికంగా అలరారుతోంది. పచ్చటి అందాలకు నెలవైన ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తిస్తే ఆ ప్రాంత అభివృద్ధితో ఆధ్యాత్మిక గుభాళింపులు వీస్తాయి. వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామికి తూర్పు ముఖంగా 3 కిలోమీటర్ల దూరంలో బండిపాలెం, గుండబోయినపాలెం, పోచంపల్లి గ్రామాల పరిధిలో గరుడాచల కొండపై క్షేత్రం ఉంది. ప్రాచీన గరుడాచల వీరనారసింహ క్షేత్రం భక్తుల పాలిట కల్పతరువులా బాసిల్లుతోంది. ధర్మం, నిస్వార్థ సేవ, భక్తికి ప్రతీకైన ఆంజనేయుడు క్షేత్రపాలకుడిగా ఉన్నాడు.

ఆంధ్రజ్యోతి కథనంతో వెలుగులోకి..

త్రేతాయుగం నాటి ఈ క్షేత్రం పరిసర గ్రామాల ప్రజలకు మినహా మిగిలిన వారికి పెద్దగా తెలియదు. ప్రతి శనివారం దూపదీప నైవేద్యాలతో పాటు ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నాడు కల్యాణ మహోత్సవాన్ని తరతరాలుగా నిర్వహిస్తున్నారు. ఉత్సవానంతరం భక్తులు పెద్దగా ఇక్కడికి రారు. కొండపైకి వెళ్లేందుకు కష్టంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో 2006లో 'ఎవరీ బంగారు దంతాల బెంగాలీ బామ్మ' గరుడాద్రి గుహల్లో బసపై ఆంధ్రజ్యోతి కథనంతో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు క్షేత్రానికి రావటం ప్రారంభించారు. తగిన ఏర్పాట్లు లేకపోవటంతో కమిటీ సభ్యులు ఈశ్వరప్రగడ శేషగిరిరావు స్థానిక బండిపాలెంకు చెందిన రేపాల మోహనరావును సంప్రదించటంతో క్షేత్ర అభివృద్ధి కమిటీ పేరుతో తనకున్న పరిచయాలతో రాజకీయ, పారిశ్రామిక, స్థానిక దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి గదులు ఏర్పాటు చేశారు. పురాతన ఆలయం పునః నిర్మాణ ఆవశ్యకతను ఎమ్మెల్యే వసం త కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా రాజగోపురం, ము ఖ మండపం, ధ్వజస్థంభ ఏర్పాటుకు ముందుకు రావటంతో పనులు చేరుకుగా సాగుతున్నాయి. 2026 జనవరిలో ప్రతి ష్ఠా మ హోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొండపైకి రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు.

బంగారు దంతాల బామ్మతోనే కొండకు వెలుగు: రేపాల మోహనరావు

బంగారు దంతాల బామ్మ ఒకరు ఈ ప్రాంతానికి వచ్చారు. ఆమె 2016లో మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థం కొండ పైన మ్యూజియంతో పాటు కొండ కింద ఆమె సమాధిని ఏర్పాటు చేశాం. ఆమె వల్లే ఈ కొండ వెలుగులోకి వచ్చింది. 2016లో ఆంధ్రజ్యోతి కథనంతో ఈ ప్రాంతం వెలుగులోకి వచ్చింది.



బంగారు దంతాల బామ్మ మ్యూజియం



కొండపైకి మెట్ల మార్గం

కమిషనరేట్లో బదిలీలకు నేరుగా కౌన్సెలింగ్

గుణదల, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో 5ఏళ్లు ఒకేచోట ఉన్నవారిని బదిలీలు చేసే విషయంలో నేరుగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు కౌన్సెలింగ్ చేశారు. బదిలీలపై సిబ్బంది మనోగతం తెలుసుకునేందుకు నేరుగా తన కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభించారు. కమషనరేట్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, ఎస్ఐలు నేడు సీపీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరయ్యారు. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి అభ్యర్థనల మేరకు బదిలీల విషయంలో నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీపీ సిబ్బంది తమ సమస్యలను నేరుగా విన్నవించుకునే అవకాశం కల్పించి అందుకనుగుణంగా బదిలీల విషయంలో నిర్ణయం తీసుకోవడంతో కమిషనరేట్లో పనిచేస్తున్న సిబ్బందికి సీపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో సీపీతో పాటు అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, ఏడీసీపీ ఎం రాజారావు, ఏసీపీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.



బదిలీల్లో పారదర్శక నిర్ణయం కోసం నేరుగా సమాచారం సేకరిస్తున్న కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర

విస్సన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ పర్యటన చేస్తున్న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ సోమవారం విస్సన్నపేటకు చేరుకున్నాడు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ పర్యావరణ ప్రపంచాన్నే చూడాలనేది తన ఆశయమని మొక్కలు నాటడంపై అవగాహన కల్పిస్తున్నానన్నారు. 2021 డిసెంబర్ 28న తన ప్రయాణం సైకిల్‌పై ప్రారంభమైందని ఈ ఏడాది డిసెంబరు 28కు మాత్ర ముగుస్తుందన్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో పర్యటన చేసినట్లు చెప్పారు. పర్యావర్ణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.



సైకిల్‌పై ముత్తు సెల్వన్

మంగినపూడి బీచ్‌లో ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్ ఉత్సవాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో జరిగే ఈ ఉత్సవాలకు పర్యాటకులకు కావలసిన ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. సాంస్కృతిక ప్రదర్శనల వేదికను రూపొందిస్తున్నారు. కొత్తగా రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. సాహస క్రీడలు, బీచ్ కబడ్డీ, జలక్రీడలు ఏర్పాట్లకు రంగం సిద్ధం చేస్తున్నారు.

రింగ్ సుందరీకరణకు రంగం సిద్ధం

ఇబ్రహీంపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - హైదరాబాద్, ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ రెండు జాతీయ రహదారులకు జాయింట్‌గా ఉండే ఇబ్రహీంపట్నం రింగ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇటీవల కళావిహీనంగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలో 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం రింగ్ పచ్చని చెట్లతో, సుందరమైన పూలమొక్కలతో ఎంత అందంగా ఉండేదో, వైసీపీ అధికారం చేపట్టాక పూర్తి నిర్లక్ష్యంతో రింగ్‌ను ఎలా కళ తప్పేలా చేశారో పూర్తిగా వివరించడంతో పాటు రంగులె వెలచిపోయిన కొండపల్లి బొమ్మలు అని సవివరంగా తెలపడంతో అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిప్రదికన రింగ్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను, జిల్లేడు చెట్ల తొలగించారు. ఇసుక పోసి నేలను చదును చేసి మొక్కలను తెప్పించి అందులో నాటే పనులు చేపట్టారు. మొక్కలు నాటిన అనంతరం రింగ్‌లో ఉన్న కొండపల్లి బొమ్మలకు సైతం రంగులు వేయిస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలుపుతున్నారు.



పనులు చేస్తున్న కూలీలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చేపల మేతకు కోళ్ల వ్యర్థాలు వేస్తే చర్యలు

- పోలీస్, రెవెన్యూ అధికారులకు జిల్లా మత్స్యశాఖ అధికారి ఫిర్యాదు

విస్సన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): చంద్రుపట్ల గ్రామంలోని చెరువులలో చేపల పెంపకం కోసం మాంసం వ్యర్థాలు వినియోగిస్తున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి వి.పెద్దిబాబు ధ్రువీకరించారు. సోమవారం ఈ చేపలు తింటే అంతే అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన చెరువులను పరిశీలించారు. చెరువుల వద్ద ఉన్న మాంసం వ్యర్థాలను పరిశీలించారు. చెరువులో సాగు చేస్తున్న చేపలకు కోళ్ళ, మాంసం వ్యర్థాలు వాడుతుండటంతో పోలీసులకు, రెవెన్యూ అధికారులకు చేపలకు వ్యర్థాలు వేసి పెంచుతున్న వెంకన్నబాబు, లక్ష్మీనారాయణలపై ఫిర్యాదు చేశారు. ఇతరశాఖలతో సమన్వయం చేసుకొని ప్రత్యేక డ్రైవ్ ద్వారా అన్ని చేపల చెరువులను పరిశీలిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత చేపలను సాగు చేసినా, చేపలకు మాంసం వ్యర్థాలు వేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అగ్రికల్చర్ సచివాలయ అధికారి గోపి పాల్గొన్నారు.



చంద్రుపట్లలో చేపల చెరువులను పరిశీలిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి పెద్దిబాబు

కయాకింగ్, కెనాయింగ్

క్రీడాకారుడు జగదీష్ మృతి

విజయవాడ స్పోర్ట్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ కయాకింగ్, కెనాయింగ్ క్రీడాకారుడు వేమూరు జగదీష్ (38) గత రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జగదీష్ తన పట్టుదల, శ్రమతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కయాకర్‌గా ఎదిగారు, నదులపై నావ నడపడంలో ఆయన ప్రావీణ్యంతో దేశవాళీ, జాతీయ స్థాయి పోటీల్లో పలు బంగారు పతకాలను అందించారు. అలాగే యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలవడమే కాకుండా, ఒక మార్గదర్శకుడిగా నిలవడం, క్రీడల పట్ల ఆయన చాటిన నిబద్ధతకు నిదర్శనం. ఆయన మృతి పట్ల క్రీడా సంఘాలు, అభిమానులు సహచర క్రీడాకారులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర కెనయింగ్, కయాకింగ్ కార్యదర్శి శివారెడ్డి సహా పలు క్రీడాసంఘాల ప్రతినిధులు జగదీష్ కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు.



విశాఖ ఉక్కు కాంట్రాక్ట్

కార్మికుల సమ్మెకు మద్దతుగా ధర్నా

ధర్నాచౌక్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ పక్రియను నిలుపుదల చేయాలని పలు కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోని తీసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా స్థానిక ధర్నా చౌక్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలోని కార్మికులను పథకం ప్రకారం కేంద్ర ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. దీన్ని అడ్డుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. ఇప్పటికే 3వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, మరికొన్ని వేల మందిని తొలగించేందుకు ప్రయత్నించడం దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ రాష్ట్ర నేతలు వీవీఎల్ నరసింహులు, ఎస్ వెంకటసుబ్బయ్య, కే పొలారి ప్రసంగించారు. ఆయా సంఘాల నేతలు కే దుర్గారావు, సాంబశివరావు, ఏ వెంకటేశ్వరరావు, ఈవీ నారాయణ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నా కుమారుడి మృతిపై

విచారించి, న్యాయం చేయండి

- వెట్టి కార్మికురాలు అంకమ్మ

గాంధీనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడి మృతిపై సమగ్రంగా విచారించి నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని చిత్తూరు జిల్లాలోని చవటపాలెంకు చెందిన అంకమ్మ అనే మహిళా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడింది. తొమ్మిదేళ్ల క్రితం భర్తతో కలిసి ఓ బాతుల వ్యాపారి వద్ద పనికి చేరామని, ఈ క్రమంలో వ్యాపారి నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నామన్నారు. 3నెలల క్రితం తమ 9 ఏళ్ల కుమారుడిని వ్యాపారి తీసుకెళ్లాడని, డబ్బు చెల్లించి కుమారుడిని తీసుకువచ్చేందుకు వెళ్లగా అక్కడ లేకపోవడంతో బాధితురాలు పోలీసుల ఫిర్యాదు చేసింది. బాలుడు అనారోగ్యంతో మరణించడంతో తమిళనాడులో పూడ్చినట్టు పోలీసులకు సమాచారం అందిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. వెట్టి విమోచన వేదిక కన్వీనర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో యానాది వంటి అణగారిన వర్గాల ప్రజలు బాండెండ్ లేబర్‌కు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెట్టి బాండెడ్ లేబర్ బాధితుల కోసం ప్రత్యేక రాష్ట్రస్థాయి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. వెట్టి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని కోరారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ బాలాజీ హెచ్చరిక



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, అధికారులు

మచిలీపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజలిచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ బాలాజీ హెచ్చరించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో జేసీ గీతాంజలిశర్మ, ఇతర విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినట్టు చూపేందుకు తనవద్ద ఎండార్స్‌మెంట్‌పై సంతకాలు చేయించుకుంటున్నారని, కానీ అర్జీదారులకు ఎండార్స్‌మెంట్‌లు ఇవ్వడం లేదని గ్రహించానన్నారు. పలు సమస్యలపై పదేపదే అర్జీలు ఇస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే అధికారులు దురుసుగా మాట్లాడుతున్నారని, ఈ పద్ధతిని విడనాడాల్సిందేనన్నారు. అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని ఫోన్‌చేస్తే అధికారులు ఏం మాట్లాడుతున్నారో ప్రత్యేకయాప్‌లో రికార్డు అవుతోందన్నారు. ఇక నుంచి తాను నేరుగా అర్జీదారులకు ఫోన్ చేసి, మాట్లాడి వివరాలు తెలుసుకోవడం ప్రారంభిస్తానన్నారు. యోగాంధ్రలో ప్రతి ఒక్క ఉద్యోగి తమ పేరును నమోదు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. జేసీ గీతాంజలిశర్మ మాట్లాడుతూ త్వరలో 5వేల మందితో జిల్లాలో యోగాసనాలు వేయించేందుకు ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. ఐ గాట్ కర్మయోగి ఆన్‌లైన్ శిక్షణా తరగతులను నిర్వహించేందుకు డీఈవో, డీపీవో, పోలీస్ విభాగాలు చొరవ తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి యోగాంధ్రలో ప్రజలను భాగస్వాములుగా చేయాలన్నారు. 145 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

జిల్లాలో యోగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు సచివాలయ ఉద్యోగులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ఆయన ఉదయపు నడకమిత్ర మండలి హాలులో జరిగిన యోగ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా అధికారులు ముందుకు రావాలన్నారు. మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ సెంటర్ నుంచి సాయిబాబా దేవాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తారన్నారు. 28న మండల స్థాయిలో మాస్టర్ ట్రైనీలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువకులకు యోగ శిక్షణ నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వజ్రాసనం, త్రికోనాసనం, ప్రాణాయామాలు, సూర్యనమస్కారాలు చేశారు. 31న మంగినపూడి బీచ్, 6న కూచిపూడి, 13న ఘంటసాల, 19న మోపిదేవిలో యోగ శిక్షణా తరగతులు జరుగుతాయి.

పారదర్శకంగా నిర్వహించాలి

ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని సోమవారం నూతనంగా ఎన్నికైన కృష్ణాజిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పీ రాము కోరారు. సోమవారం కలెక్టర్ బాలాజీని కలిసి ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ఆ దిశగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, కృష్ణాజిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. అధ్యక్షుడు రాముతో పాటు కార్యవర్గ సభ్యులు తోట వరప్రసాద్, జీ శ్రీనివాస్, లోకేశ్వరరావు, సీహెచ్ సత్యనారాయణ, హుస్సేన్, జీ రామకృష్ణ ఉన్నారు.

జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



యోగాసనాలు వేస్తున్న కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

సత్యనారాయణపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా ఆయూష్‌శాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బీఆర్‌టిఎస్ రోడ్డు శారదా కాలేజీ జంక్షన్ వద్ద కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్యం కుటుంబం సంక్షేమం కమిషనర్ వీరపాండ్యన్‌తో కలిసి పాల్గొని యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 15లక్షల మందికి యోగాను నేర్పే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఆయూష్ డైరెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యం దృఢమవుతుందన్నారు. వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్, జిల్లా ఆయూష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, మెడికల్ ఆఫీసర్ వై.రత్నప్రియదర్శిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధీ కొండపై యోగాసనాలు

వన్‌టౌన్: ఆరోగ్యానికి అంత్యంత ప్రాధాన్యమిచ్చిన మహాత్ముని ఆశయాల కీర్తి శిఖరమైన గాంధీ కొండపై యోగాంధ్ర నిర్వహించినందుకు చాలా ఆనందంగా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా సోమవారం విజయవాడలోని గాంధీహిల్‌పై గాంధీహిల్ ఫౌండేషన్, జిల్లా యంత్రాంగం, ఏపీ టూరిజయం డిపార్టుమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర లో భాగంగా ప్రజలకు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించి జీవితాంతం ఆచరించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవానీ ద్వీపం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనం, కొండపల్లి ఖిల్లా తదితర ప్రాంతాల్లోనూ యోగాంధ్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గాంధీ హిల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గాంధీ పీసీ కాజా, కార్యదర్శి వై.రామచంద్రరావు, ప్రతినిధులు శిల్పా, ప్రసన్న లక్ష్మీ, కృష్ణచైతన్య, సుధీర్ పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



కలెక్టరేట్: దివ్యాంగుల ఆవేదనను ఆలకించి ఆపై సత్వరం స్పందించి మూడు చక్రాల సైకిలును అందచేసి జీవిత మార్గానికి బాటవేసిన జిల్లా అధికారులు, ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) దివ్యాంగుల జీవన మార్గానికి బాటలు వేసింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి పర్యటనకు బయలుదేరుతున్న సమయంలో దివ్యాంగుణ్ని చూసి అతడి వద్దకు వెళ్లి అర్జీని స్వీకరించి అదేరోజు మూడు చక్రాల సైకిల్‌ను అందించిన వార్తా కథనాన్ని చూసి అదే పరిస్థితిలో ఉన్న మరికొందరు తమకు కూడా న్యాయం జరుగుతుందనే ఆశతో మే 12న జరిగిన పీజీఆర్ఎస్‌లో నగరంలోని 21వ డివిజన్‌కు చెందిన సింహాద్రి క్షీరవర్ధి, విజయవాడ రూరల్ మండలం గొల్లపూడికి చెందిన అన్నవరపు వరప్రసాద్ తమకు మూడు చక్రాల సైకిళ్లను అందచేసి ఆదుకోవాలని అడిగారు. స్పందించిన జిల్లా యంత్రాంగం దివ్యాంగుల అర్హతలను పరిశీలించి దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను సమకూర్చడంపై జిల్లా రెవెన్యూ అధికారి దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల సహాయంతో సోమవారం కలెక్టరేట్‌లో ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లకు అందించారు. అతి తక్కువ సమయంలో తమకు ఉచితంగా వాహనాలు అందచేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇళ్లపట్టాల కేసులో వంశీ అనుచరుడు రంగాకు కస్టడీ

హనుమాన్‌జంక్షన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి రంగాను జంక్షన్ పోలీసులు రెండు రోజులు పాటు కస్టడీకి తీసుకున్నారు. అందులో భాగంగా సోమవారం విజయవాడ జిల్లా జైలు నుంచి మధ్యాహ్నం 12గంటల సమయంలో రంగాను జంక్షన్ పీఎస్‌కు ఎస్సై వీ సురేశ్ ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. జంక్షన్ సీఐ సత్యనారాయణ మూర్తి ఇళ్లపట్టాలు పంపిణీ కేసులో విచారణ నిర్వహించారు. ఈ కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న రంగాను మంగళవారం సాయంత్రం తిరిగి నూజివీడు కోర్టులో హాజరు పరచనున్నారు. ఇదేకేసులో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను సోమవారం కోర్టు తిరస్కరించింది. ఈ నెల 29 వరకు వంశీ రిమాండ్ విధించిన నేపథ్యంలో నూజివీడు సెకండ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బెయిల్ పిటీషన్ విచారణకు తిరస్కరించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

గుడివాడ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యపై వచ్చిన దరఖాస్తును వెంటనే స్పందించి ఆయా శాఖలకు పంపిస్తున్నట్టు తెలిపారు. సోమవారం ప్రజా సమస్యలపై రెండు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామశేషు, ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

76 శాతం రుణాల వసూలు

పమిడిముక్కల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా కో ఆపరేటివ్ బ్యాంకు వీరంకిలాకు బ్రాంచ్‌లో 76శాతం రుణాలు వసూలుచేసిన ట్లు బ్రాంచ్‌మేనేజర్ టి.ఉదయ్‌కుమార్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో రూ. 52 కోట్లు రుణాలివ్వగా అందులో రూ. 40.15 కోట్లు వసూలు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో సూపర్‌వైజర్ సీతారామశర్మ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం నేత హరిబాబు

దేశసమైక్యతను రక్షించుకుందాం

గుడివాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : దేశ సమైక్యతను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మతం పేరుతో మోసాలు చేస్తున్న బీజేపీని వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర నాయకులు మాగంటి హరిబాబు అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఉగ్రవాద వ్యతిరేక పోరాటామా? ఆమెరికాకు లొంగుబాటా? అంశంపై సమైక్యతా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన హరిబాబు మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా దేశం అన్నిరంగాల్లో నీరుగారిపోయేలా బీజేపీ పాలన సాగిందన్నారు. దేశంలో ప్రజలు మధ్య మతం పేరుతో చిచ్చుపెట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ నిరంకుశ విధానాలను దేశంలోని లౌకిక ప్రజాతంత్రవాదులంతా ఐక్యంగా ప్రతిఘటించి దేశసమైక్యతను, సమగ్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రజిని, పట్టణ కమిటీ సభ్యులు శివనాగమల్లేశ్వరరావు, లంకా సురేంద్ర, తాజుద్దీన్, లౌకికవాదులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయాల నిర్మాణం

● బేస్‌మెంట్‌తోనే ఆగిపోయిన నిర్మాణ పనులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : గత వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా తయారయ్యాయి. 2020లో చేపట్టిన సచివాలయాల నిర్మాణం కొన్ని పూర్తవగా కొన్ని బేస్‌మెంట్స్, శ్లాబుల దశలో నిలిచిపోయి వెక్కిరిస్తున్నాయి. తోట్లవల్లూరులో 16 గ్రామ పంచాయతీలను 13 గ్రామ సచివాలయాల కిందకు తీసుకు వచ్చారు. 2020లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో 13 గ్రామ సచివాలయాల నిర్మాణానికి నాటి వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున ఉపాధి హామీ నిధులను కేటాయించింది.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

బేస్‌మెంట్ వరకు ఉన్న నిర్మాణాలను గత ప్రభుత్వంలోనే ఆపివేయమన్నారు. శ్లాబు దశకు చేరిన వాటినే పూర్తిచేయాలని ఆదేశించారు. ఇపుడు నిర్మాణాలు మొదలు పెట్టేందుకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

శరాబందిరాజు , మండల పీఆర్ ఏఈ

రూ. 40 లక్షలతో తోట్లవల్లూరు-2 గ్రామ సచివాలయం నిర్మాణానికి కనకదుర్గమ్మ కాలనీలో 2020 జనవరి 10వ తేదీన అప్పటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేశాక కొందరు వ్యక్తులు వ్యతిరేకించటంతో నిర్మాణపనులను అర్థాంతరంగా నిలిపివేశారు. తోట్లవల్లూరు-1సచివాలయాన్ని గాంధీ పార్కు తొలగించి నిర్మించారు. ఇది కూడా పూర్తిగా వినియోగంలోకి రాలేదు.

రొయ్యూరు వాటర్ ట్యాంకు వద్ద రూ.79.30 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు 2022 జూలై 20న శంకుస్థాపన అట్టహాసంగా చేశారు. కాని ఇది బేస్‌మెంట్‌తోనే నిలిపివేశారు. దీంతో గ్రామ సచివాలయాన్ని పంచాయతీ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. పాములలంక, వల్లూరుపాలెం. గరికపర్రులోను సచివాలయాల భవననిర్మాణం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.



కనకదుర్గమ్మ కాలనీలో బేస్‌మెంట్ లెవెల్లో ఆగిపోయిన సచివాలయ భవనం



తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో నిరుపయోగంగా ఉన్న సచివాలయం



నార్తువల్లూరు శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కుసుమకుమారి

శ్మశానవాటిక స్థలం సర్వేకు ఆదేశం

● తహసీల్దార్ ఎం. కుసుమకుమారి

తోట్లవల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కరకట్ట ఒడ్డున నార్తువల్లూరు శ్మశానవాటిక స్థలాన్ని సోమవారం తహసీల్దార్ ఎం. కుసుమకుమారి పరిశీలించారు. ఇక్కడ 48 సెంట్లు శ్మశానవాటిక ఉన్నప్పటికీ అన్యాక్రాంతంగా ఉండటంతో ఖర్మకాండలకు ఉపయోగం లేకుండా మారింది. దీంతో గ్రామానికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు ఈ శ్మశానవాటిక స్థలాన్ని తేల్చాలని అధికారులను కోరారు. స్థలాన్ని సర్వే చేసి హద్దులు వేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో తహసీల్దార్ స్వయంగా వచ్చి శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆ స్థల సర్వేకు చర్యలు తీసుకోవాలని కుసుమకుమారి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

మెరుగైన వైద్యసేవలే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల కేంద్రమైన మొవ్వలో 50 లక్షల నిధులతో నిర్మించిన మెడికల్ బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, తహసీల్దార్ కె.మస్తాన్, ఎండీవో జె.విమాదేవి, స్థల దాత మండవ వాసుదేవరావు, వైద్యాధికారులు సీహెచ్.రాజేశ్వరి, భగవాన్, మాజీ ఎంపీపీ కిలారపు మంగమ్మ, సీహెచ్‌వో శంకరరావు, పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

మొరాయిస్తున్న సర్వర్ .. తప్పని తిప్పలు

నందివాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామాలలో ప్రజలకు 100 రోజుల పనిదినాలు కల్పించుటకు ఉపాధి హామీ పథకం కూలీలంతా ఫొటోలు దిగటానికి ఎక్కువ సమయం పడుతుందని కూలీలు తెలిపారు. ఉదయం 7 గంటలకు పనికి వస్తుంటే చేసేది నాలుగు గంటల పని అయితే ఫొటో దిగటానికే రెండు గంటలు సమయం పడుతుందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ సరిగా పని చేయక కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు సమయానికి రాక ఈ ఫొటోలతో నానా ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పని సమయంలో మండల స్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఆడింది ఆట.. పాడింది పాటగా కొనసాగుతున్నారని మండలా లవారీగా ఉపాధి కూలీలు వాపోతున్నారు. గ్రామాలలో ఉపాధి పనులు నిర్వహించాలంటే పంచాయతీల ద్వారా తీర్మానం తప్పనిసరి అని మండల ఉపాధి పనుల అధికారి దేవానంద్ రాజు తెలిపారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ, పొటోలు తీసుకువెళ్లేందుకు సర్వర్ పని విధానం ఫీల్డ్ అధికారులకు చూపించే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.



ఫొటోల కోసం ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలు

శరవేగంగా ఆలయ గోపుర పునఃనిర్మాణం

గుడ్లవల్లేరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో దాదాపు రూ. 75 లక్షల వ్యయం అంచనాలతో నిర్మిస్తున్న రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపుర పునఃనిర్మాణ పనులు, జీర్ణోద్ధరణ ఆలయ నూతన నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. గ్రామస్థులు, గ్రామానికి చెందిన వారు ఇతర దేశాల్లో, ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు కుటుంబాల వారీగా విరాళాను అందిస్తున్నారు. నిర్వాహక కమిటీ నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా చేయిస్తున్నారు. ఇటీవలే గంగానమ్మ అమ్మవారి నూతన విగ్రహం, పోతురాజు విగ్రహాలను తమిళనాడు మహాబలిపురంలోని ప్రఖ్యాత శిల్పులచే సిద్ధం చేసేందుకు ఆర్డరు ఇచ్చారు. ఆలయాల నగిషీ పనులను గోదావరి జిల్లాకు చెందిన శిల్పులతో చేయిస్తున్నారు. నిర్మాణ పనులను గ్రామ పెద్దలు వల్లభనేని వెంకట్రావు, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, పోలవరపు వెంకట్రావు, రామకోటేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.



కొనసాగుతున్న సత్యదేవుని ఆలయ గోపురం పనులు

బదిలీ ఉపాధ్యాయుల లిస్టు వెరిఫికేషన్

గుడివాడ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలంలో 26 మంది ఖచ్చితంగా బదిలీ కావాల్సిన ఉపాధ్యాయులు ఉన్నారని ఎంఈవో -2 బాలాజీ చెప్పారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీ కోసం దరఖాస్తు చేస్తున్న ఉపాధ్యాయుల లిస్టులను వెరిఫికేషన్ చేస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులను పిలిచి వారు పెట్టుకున్న ప్లేసులు, ఉన్న పాఠశాలల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. మండలంలో 78 మంది దరఖాస్తు పెట్టుకున్నారని, 155 మంది రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఖాళీ అవుతాయని తెలిపారు. మొత్తం వెరిఫికేషన్లు పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయుల సమక్షంలో అనుమానాలు ఏమున్నా వారిని అడిగి ఫైనల్‌గా రిపోర్టులు పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో బాలాజీకి వెరిఫికేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిరాశ్రయులకు భోజన వసతి

గుడివాడ, మే26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో పందిళ్ల రాజేష్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సోమవారం వృద్ధులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజేష్ కుటుంబసభ్యులు భారతి, వెంకట నాగేశ్వరరావు, గాజుల శివకుమారి, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.



భోజనవసతి కల్పిస్తున్న రాజేష్ కుటుంబసభ్యులు



అధికారులతో మాట్లాడుతున్న ఎండోమెంట్స్ ల్యాండ్ ప్రొటెక్షన్ డిప్యూటీ కలెక్టర్ భారతి

సద్దుమణిగిన సరిహద్దు పంచాయితీ

గుడివాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దు విషయంలో గత కొంతకాలంగా దేవాదాయ శాఖ, ప్రైవేట్ స్థల యజమానులకు మధ్య నడుస్తున్న పంచాయితీ ఒక కొలిక్కి వచ్చింది. వలివర్తిపాడు సర్వే నెం. 180లో తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ స్టూడెంట్స్ హోమ్ ట్రస్ట్‌కు 10.27ఎకరాలు కలదు. సరిహద్దు విషయంలో ట్రస్ట్‌కు, ప్రైవేట్ స్థల యజమానులకు ఆరేళ్లుగా వివాదం నడుస్తుంది. ఈ క్రమంలో సోమవారం దేవాదాయశాఖ, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతి, తహశీల్దార్ వి.రామకోటేశ్వరరావులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎట్టకేలకు సర్వే పూర్తిచేసి సరిహద్దు వివాదానికి తెరదించారు. సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసి ట్రస్ట్‌కు 10.27ఎకరాల భూమిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావు, దేవాదాయ శాఖ జిల్లా అధికారి సాంబశివరావు, డిప్యూటీ తహశీల్దార్ రామశివ, ఆర్.ఐ నాగబాబు, పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల నియంత్రణే ధ్యేయం

గుడివాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : శివారు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటుచేసి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టామని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలను తరచూ చేస్తున్నామన్నారు. వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండటంతో ఎల్.హెచ్.ఎం.ఎస్ యాప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ-బీట్స్, ఈ-సాక్ష్య యాప్‌లను ప్రతి ఒక్కరూ వినియోగించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రముఖుల విగ్రహాల వద్ద సి.సి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లేడీస్ హాస్టళ్ళ వద్ద కాంపౌండ్, వాచ్ మెన్, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. 112/శక్తి యాప్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని, సమస్యను పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లలో నమోదై, దర్యాప్తులో ఉన్న ఎస్సీ,ఎస్టీ కేసులు, మహిళలపై దాడులు, మిస్సింగ్, 194 బి.ఎన్.ఎస్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు.

మంచినీటి పంపులకు డిపాజిట్లు చెల్లించలేం

గుడివాడ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి పంపుల కోసం, పైపుల రిపేర్ల కోసం తాము డిపాజిట్లు చెల్లించలేమని శ్రీకాళహస్తి కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు బి.వి. రమణ, ఉత్తర లక్ష్మీలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శ్రీకాళహస్తి కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజువారీ పనులు చేసుకుని బతికే తాము పంపుల కోసం ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు డిపాజిట్ ఎలా చేస్తామన్నారు. గత 15ఏళ్లుగా ట్యాంకర్ల ద్వారా మంచి నీరు సరఫరా అవుతుందని, తాము నీళ్లు మోసుకోలేక విసిగిపోయామన్నారు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కాలనీకు పైపుల ద్వారా మంచి నీటిని అందిస్తామని హామీ ఇచ్చారని, వెంటనే హామీనీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పైపు లైన్లు ఏర్పాటుకు అధికారులు తయారు చేసిన అంచనాలను ఆమోదించి ప్రభుత్వపరంగా పనులు చేయించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు చాట్ల కుమారి, మరియమ్మ, హైమావతి, గౌరీ, నాగమణి, హసీనా బేగం, ఆసియా బేగం తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న శ్రీకాళహస్తి కాలనీ సభ్యులు

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

● ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణు ప్రసాద్

గుడివాడ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం సక్రమంగా ఉండే విధంగా కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో డి.వై. విష్ణు ప్రసాద్ అన్నారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వస్తున్నందున తాగునీటి విషయంలో పైపులు లీకేజీ లేకుండా చూడాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో బ్లీచింగ్ పౌడర్ నిల్వలు ఉంచుకోవాలన్నారు. రహదారుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారులకు నీతికథలపై అవగాహన



పామర్రులో నీతికథల ఆవశ్యకతను వివరిస్తున్న సురేష్

పామర్రు, మే 26 (ఆంధ్రజ్యోతి): బాల్యదశనుంచే నీతికథల పట్ల చిన్నారులు అవగాహన పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా సోమవారం చిన్నారులకు నచ్చిన పుస్తకాలైన పంచతంత్ర, నీతికథలు, తెలుగు సామెతలు ,శతక పద్యాలు చదివించి వాటిపై అర్థవంతంగా, వివరణాత్మకంగా పుస్తక సమీక్ష నిర్వహించారు. వాటితోపాటు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇదే విధంగా జమీగోల్వేపల్లి గ్రంథాలయంలో సురేష్ విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బ యాలజీ అధ్యాపకుడు కెసురేష్, పాఠకులు, విద్యార్థులుపాల్గొన్నారు.

పెదపారుపూడి: యలమర్రు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. విద్యార్థులచే కథలు చదివించారు. చెస్, క్యారమ్స్ ఆటలు ఆడించారు. గ్రంథాలయ నిర్వాహకులు జె.విజయలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



యలమర్రు శాఖా గ్రంథాలయంలో ..

విద్యుత్‌కు అంతరాయం నేడు

గుడివాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం 27వ తేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేతవోలు, కార్మికనగర్, బాపూజీనగర్, శ్రీకాళహస్తి కాలనీ, దొండపాడు కాలువ నుంచి మల్లాయిపాలెం రైల్వే గేటు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ చెల్లింపుల్లో కేంద్ర నిర్ణయం హర్షణీయం

గుడివాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధులను సర్పంచుల ఆధ్వర్యంలోనే చెల్లింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు కాకరాల సుభాష్‌చంద్ర బోస్(సురేష్) అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధి హామి పథకం చెల్లింపుల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తామంతా స్వాగతిస్తున్నామన్నారు. గ్రామసర్పంచులు గుర్తింపు పొందే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో పనుల్లో నాణ్యత పెరుగుతుందని, అక్రమాలకు తావు లేకుండా ఉంటుందన్నారు. పంచాయితీరాజ్ శాఖలో సర్పంచులకు ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు మెటీరియల్ సరఫరా చేసే వారికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ద్వారా చెల్లించే విధానం సరి కాదని కేంద్ర ప్రభుత్వం గుర్తించడం పట్ల కాకరాల సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

వివాహిత అదృశ్యం

గుడివాడ : స్థానిక పంచవటి కాలనీకి చెందిన వలిశెట్టి వెంకన్న, వెంకటరత్నంలు ఆదివారం సాయంత్రం చిన్న విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో భార్య వెంకటరత్నం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సోమవారం సాయంత్రం వరకు ఎంత వెతికినా భార్య ఆచూకీ తెలియకపోవంతో టూటౌన్ పోలీసులను వెంకన్న ఆశ్రయించారు. వివాహిత అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్సై వి.జాస్మిన్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

నేడు యోగాపై శిక్షణ

పెడన రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పెడన మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు యోగాపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎండీవో ఎ.అరుణ కుమారి తెలిపారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా గ్రామాల వారీగా శిక్షకులకు మండల, పట్టణస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాస్థాయి శిక్షకులు ఎన్‌వీఆర్ భాష్యం, అంకెం శ్రీనివాసరావు, సమ్మెట శివరామకృష్ణశాస్త్రి, నాగలక్ష్మి, ఉషశ్రీ యోగాసనాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మచిలీపట్నం టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ డీకే బాలాజీకి ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్పొరేషన్ పరిధిలో 600 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సబ్బులు, చెప్పులు, కొబ్బరినూనె వెంటనే అందజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బూర సుబ్రహ్మణ్యం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సరెండర్ లీవులు, డీఏలు ప్రభుత్వం కోత పెడుతోందని వివరించారు. యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ బుల్లెమ్మ, సీఐటీయూ నాయకుడు సీహెచ్ జయరావు, గుర్రం నాగేశ్వరమ్మ, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.



దేవాలయాల భూముల లీజు కాలపరిమితిని పెంచొద్దని నినదిస్తున్న బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

దేవాలయాల భూముల లీజును
33 ఏళ్లకు పెంచొద్దు

మచిలీపట్నం టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): దేవాలయాల భూములు లీజును 11 ఏళ్ల కాల పరిమితి నుంచి 33 ఏళ్లకు దేవదాయ శాఖ అధికారులు పెంచడం తగదని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల దేవదాయశాఖ భూముల లీజులపై మార్పు చేసిందని, దీనిపై జూన్ 2వ తేదీ వరకు అభ్యంతరాలు తెలియజేయమందని, ఈ ఉత్తర్వులను విశ్వహిందూ పరిషత్ పూర్తిగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు, శ్రీరామశర్మ, గరికపాటి వెంకట్రావు, ఏడుకొండలు, పిచ్చుక శంకరరావు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సుబ్బారావు, వాసు పాల్గొన్నారు.

ఆధార్ వివరాలు సవరించుకోండి

● రైతులకు తహసీల్దార్ బి.విజయప్రసాద్ సూచన



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయప్రసాద్

ఘంటసాల, మే 26(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల వివరాల పరిశీలనలో భాగంగా 1,244 మంది రైతుల ఆధార్ వివరాలు సవరించుకోవాల్సి ఉందని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ వివరాలు సవరించుకోవాల్సిన రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. వెంటనే వీఆర్వోను సంప్రదించి, ఆన్‌లైన్‌లో సరి చేసుకోవాలని సూచించారు. సాగుచేసే ప్రతీ రైతుకు పంట సాగుదారు హక్కు పత్రాలను అందజేస్తామని, కౌలుదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ మండల అధికారి కె.మురళీకృష్ణ, రీ సర్వే డీటీ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్‌తో కలిసి పులిగడ్డ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిని పరిశీలిస్తున్న డీఈ రమేష్‌బాబు

రహదారి మరమ్మతులకు నిధులు కేటాయించండి

అవనిగడ్డ రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న పులిగడ్డ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి మరమ్మతులకు నిధులు కేటాయించాలని పంచాయతీరాజ్ డీఈ రమేష్‌బాబును సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ కోరారు. సర్పంచ్ అభ్యర్థన మేరకు సోమవారం రహదారి పరిశీలనకు డీఈ పులిగడ్డ వచ్చారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, రహదారి మరమ్మతులకు నిధులు కేటాయించాలని డీఈని సర్పంచ్ కోరారు. నిధుల లభ్యత మేరకు రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని డీఈ హామీ ఇచ్చారు. ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అనిత, సచివాలయ ఏఈ భార్గవ్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌కు 351 మంది హాజరు

పెడన రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఏపీ ఎప్‌సెట్(ఇంజనీరింగ్) 2025 పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 179 మందికి 173 మంది, మధ్యాహ్నం పరీక్షకు 181 మందికి 178మంది మొత్తం 351 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు.

వైభవంగా విజయ అమలేశ్వరీదేవి ఉత్సవాలు

పెడన రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): దావోజీపాలెంలో విజయ అమలేశ్వరీదేవి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం అంకగుడారం, సిద్ధుల యాగం, మాతా కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. 11 రోజులపాటు నిర్వహించే ఏకాదశ క్రతువు కార్యక్రమాలకు దూరప్రాంతాల నుంచి అంకెం వారి వంశీయులు, అడపడుచులు, భక్తులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

చల్లపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ జిల్లా విభాగం పర్యవేక్షణలో హెచ్‌ఐవీపై జానపద కళాజాత ప్రచార కార్యక్రమాన్ని లక్ష్మీపురంలో సోమవారం నిర్వహించారు. గుడివాడకు చెందిన ఎం.శేఖర్‌బాబు బృందం వీధినాటిక ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఐసీటీసీ కేంద్రాలు, రక్తదానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, వైద్య సిబ్బంది, కేవైఎస్ఎస్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నం నుంచి మహానాడుకు వెళుతున్న టీడీపీ నాయకుడు పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు



అవనిగడ్డలో జెండా ఊపి కార్లను సాగనంపుతున్న దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

మచిలీపట్నం టౌన్/ అవనిగడ్డ, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల నుంచి నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు మేరకు టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్, బందరు రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, కార్యదర్శి కాటం మధు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచేనాని తదితరులు నాలుగు బస్సులు, 25 కార్లలో బయలుదేరి వెళ్లారు.

అవనిగడ్డ నుంచి 50 కార్లలో..

కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి అవనిగడ్డ నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు తరలివెళ్లేందుకు పార్టీ నియోజకవర్గ నేత, పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ ప్రత్యేకంగా వాహనాలు సమకూర్చారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. అవనిగడ్డ నుంచి పది కార్లలో, నియోజకవర్గం నుంచి 50కిపైగా కార్లలో కార్యకర్తలు తరలివెళ్లారు. మహానాడు చివరి రోజైన 29వ తేదీన బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్లే వారి కోసం ఆరు మండలాల నుంచి బొబ్బా గోవర్ధన్ సహకారంతో టూరిస్ట్ బస్సులు ఏర్పాటు చేశామని, కార్యకర్తలు మండల పార్టీ కార్యాలయం, మండల ప్రధాన కేంద్రంలోని సీనియర్ నేతల వద్ద, నియోజకవర్గ కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కొల్లూరి వెంకటేశ్వరరావు సూచించారు. టీడీపీ నేతలు కర్రా సుధాకర్, లకనం నాగాంజనేయులు, చిట్టా అన్నపూర్ణయ్య, మేడికొండ విజయ్, కొల్లూరి ఇమ్మానియేలు, కోట సాయి, తూమాటి ప్రసాద్, బొప్పరాజు సందీప్, విజయ్ పాల్గొన్నారు.



ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.1,10,116 విరాళం

కోడూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కోడూరులో పునర్నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి రేపల్లెకు చెందిన వేమూరి శివశంకరరావు కుటుంబ సభ్యులు రూ.1,10,116 విరాళాన్ని అందించారు. సోమవారం శివశంకర్‌రావు స్వగృహం వద్దకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వెళ్లి విరాళాన్ని అందుకున్నారు. శివశంకరరావు కుటుంబసభ్యులను సత్కరించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, బడే భావన్నారాయణ, అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.



దాతను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త పాండురంగారావు, అర్చకుడు భాను నంబూద్రి

అన్నదాన నిధికి రూ.లక్షన్నర విరాళం

చల్లపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): నిమ్మలతోటలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలో శాశ్వత అన్నదాన నిధికి మొవ్వకు చెందిన నందిపాటి వెంకటేశ్వర్లు, ఆయన కుమారులు వెంకట నాగరమేష్, మురళీకృష్ణ రూ.1,50,116ను విరాళంగా అందజేశారు. దేవాలయంలో మండల కాల సమయంలో నిర్వహిస్తున్న అన్నదానం నిమిత్తం ఈ విరాళాన్ని అందజేయగా దాతను ఆలయ ధర్మకర్త అన్నవరపు పాండురంగారావు గురుస్వామి, అర్చకులు భాను నంబూద్రి సత్కరించారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో వేసిన బొమ్మలు చూపుతున్న విద్యార్థులు

సందడిగా వేసవి శిక్షణ

మచిలీపట్నం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సందడిగా సాగుతోంది. శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం పిల్లలతో బొమ్మలు వేయించారు. పాటలు పాడించి, కథలు చెప్పించారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లలు క్యారమ్స్, చెస్ ఆటలు ఆడారు. విద్యార్థులు, వై. జయలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



దత్తాశ్రమంలో సంపూర్ణ భగవద్గీత పారాయణ చేస్తున్న భక్తులు

గణపతి సచ్చిదానందస్వామి
పుట్టినరోజు వేడుకలు

మచిలీపట్నం టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): దత్తాశ్రమంలో సోమవారం మైసూరు దత్తాశ్రమం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలో అభిషేకాలు నిర్వహించారు. అన్నప్రసాద వినియోగం జరిగింది. మహిళా భక్తులు సంపూర్ణ భగవద్గీత పారాయణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా అవనిగడ్డలో జామ మొక్కలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు



కోడూరు వంతెన సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

ఘనంగా మండలి బుద్ధప్రసాద్ జన్మదినోత్సవం

అవనిగడ్డ/కోడూరు/నాగాయలంక/మోపిదేవి/చల్లపల్లి/ఘంటసాల, మే 25(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కూటమి నేతలు సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అవనిగడ్డ ప్రధాన సెంటర్, గాంధీక్షేత్రాల్లో కేక్‌లు కట్‌చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న వృద్ధులు, సాధువులకు భోజనాలు సమకూర్చారు. అవనిగడ్డలో 250 మందికి అన్నపురెడ్డి వెంకటస్వామి జామమొక్కలు పంపిణీ చేశారు. లంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాగాయలంకలో ప్రసన్న అంజనేయస్వామి ఆలయంలో బుద్ధప్రసాద్ పేరిట పూజలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో కేన్సర్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కోడూరులో జనసేన పార్టీ కార్యాలయం వద్ద, ప్రధాన సెంటర్, వంతెన సెంటర్, జరుగువానిపాలెం గ్రామాల్లో జనసేన నాయకులు టపాసులు కాల్చి, కేక్‌లు కట్ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి బండే శేషగిరిరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కోడూరులో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, 50మంది రక్తదానం చేశారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుద్ధప్రసాద్ పేరిట అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఘంటసాల మండలం కొడాలిలో టీడీపీ కార్యాలయం, ప్రధాన సెంటర్లో నేతలు కేక్ కట్‌చేశారు. శ్రీకాకుళం శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయం, ఘంటసాల జలదీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చల్లపల్లిలో ప్రధాన సెంటర్లో కేక్ కట్ చేశారు. ఆర్బీ యూత్ ఆధ్వర్యంలో సీయోను వృద్ధాశ్రమంలో, అడపా రాంబాబు ఆధ్వర్యంలో ఆదరణ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. జనసేన ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేసి పేదలకు భోజనాలు పెట్టారు. లక్ష్మీపురం పంచాయతీలో సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు కేక్‌కట్‌చేశారు. కార్యక్రమాల్లో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీసీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, ఎంపీపీలు కోట విజయరాధిక, రావి దుర్గావాణి, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరు వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, డీసీ చైర్మన్లు నిడమానూరి దిలీప్‌కుమార్, ఐనంపూడి భానుప్రకాష్, నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, మెండు లక్ష్మణరావు, యాసం చిట్టిబాబు, నడకుదిటి జనార్దనరావు, మోర్ల రాంబాబు, బండే శ్రీనివాసరావు, తుమ్మల చౌదరిబాబు, పైడిపాముల కృష్ణకుమారి, తాడికొండ చిన్నా, బండే రాఘవ, మర్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్, బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు.

ఎస్పీకి సమస్యల ఏకరువు



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఎస్పీ ఆర్.గంగాధరరావు ముందు పలువురు తమ సమస్యలను ఏకరువు పెట్టారు.

- తన భర్త రెండేళ్ల క్రితం చనిపోయాడని, ఆస్తిని కుమారుడు, కుమార్తెకు ఇచ్చివేశారని, ఇంటి నుంచి కుమారుడు గెంటివేశాడని మచిలీపట్నం గిలకలదిండికి చెందిన లక్ష్మి అనే వృద్ధురాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- తన పొలం సరిహద్దుదారుడు పొలంలోకి వెళ్లకుండా అడ్డు తగులుతున్నాడని, అదేమిటని అడిగితే దాడికి దిగుతున్నాడని పమిడిముక్కలకు చెందిన కుమార్ అనే రైతు ఫిర్యాదు చేశారు.
- అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని అమ్ములు అనే వివాహిత తన గోడు వినిపించుకుంది.
- తనకు వివాహమై ఏడేళ్లయిందని, రెండేళ్ల నుంచి తన భర్త చెడు వ్యసనాలకు లోనై పుట్టింటికి పంపించేశాడని వడ్లమన్నాడుకు చెందిన మహిళ ఫిర్యాదు చేసింది.

ఇద్దరి మధ్య వివాదం..ఆటో దహనం

పెడన, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరభద్రపురంలో ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం ఆటో దహనానికి దారితీసింది. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. వీరభద్రపురంలో నివాసం ఉంటున్న రాజేష్, శ్యామలరావుల మధ్య వివాదం ఏర్పడింది. వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టడంపై శ్యామలరావును రాజేష్ ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన శ్యామలరావు.. రాజేష్‌పై దాడి చేసి గాయపరిచాడు. తనను గాయపరిచాడన్న కోపంతో శ్యామలరావుకు చెందిన ఆటోను ఆదివారం రాత్రి రాజేష్ తగులబెట్టాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ నిర్వహించి రాజేషే ఆటోను తగులబెట్టాడన్న నిర్ధారణకు వచ్చారు.

ఆక్రమణలు తొలగించండి

● తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు 17వ వార్డు ప్రజల వినతి

పెడన, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ఆ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న 17వ వార్డు ప్రజలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీ కోసంలో తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు అర్జీ సమర్పించారు. ఆక్రమణల కారణంగా కుంచించుకుపోయి ఇరుకుగా మారిన ఆ రోడ్డుపై రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని మునిసిపల్ అధికారులను కోరినా వారు పట్టించుకోలేదని ఆరోపించారు. సర్వే చేసి, ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని కోరారు. మెట్ల దుర్గా నాగేశ్వరరావు, రామారావుల ఆధ్వర్యంలో వార్డు ప్రజలు తహసీల్దార్‌కు ఈ అర్జీ సమర్పించారు.